ఘనంగా పశలమారమ్మ పండగ



గొండుపాలెంలో సతకంపట్టు వద్ద పూజలు చేస్తున్న మహిళలు, మాజీ సర్పంచ్ శ్రీనివాసరావు

కె.కోటపాడు: గొండుపాలెం, ఎ.కోడూరు గ్రామాల్లో ఆదివారం పశలమారమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల్లో పోతురాజుబాబుకు మహిళలు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం వసంతోత్సవాన్ని నిర్వహించారు. వసంతాన్ని పొలాలు, పశువుల పాకల్లోను రైతులు జల్లారు. పంటల దిగుబడి బాగుండాలని, పశువులు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ పశలమారమ్మ పండగను నిర్వహించినట్టు రెండు గ్రామాల్లో పెద్దలు తెలిపారు. గొండుపాలెంలో జరిగిన పూజల్లో మాజీ సర్పంచ్ వంటాకు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

4.50 లక్షల సరుగుడు నారు పంపిణీ

సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో సోమసుందరం

కె.కోటపాడు: మండలంలో సింగన్నదొరపాలెం, రామచంద్రపురం, కొత్తూరు, బత్తివానిపాలెంలలో గల వన నర్సరీల నుంచి ఈ ఏడాది 4.50 లక్షల సరుగుడు నారును 450 మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేసినట్టు జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఎం.సోమసుందరం తెలిపారు. ప్రస్తుతం నర్సరీలలో 70 వేల తెల్లమద్ది, నేరేడు, కాము, పనస, టేకు, నెమలి, వేప మొక్కలు ఉన్నట్లు ఆయన చెప్పారు.

కె.కోటపాడు, దేవరాపల్లి మండలాల్లో సోషల్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో ఎన్‌టీపీసీ నిధులతో రోడ్లకిరువైపులా నాటిన మొక్కలను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొండుపాలెంలో దండుముత్యాలమ్మ ఆలయం నుంచి



గొండుపాలెంలో మొక్కలను పరిశీలిస్తున్న సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో సోమసుందరం

మునసబు కళ్లాల మధ్య, పైడంపేట–మునసబు కళ్లాల మధ్య, ఆనందపురం నుంచి ముషిడిపల్లి, అచ్చియ్యపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ముషిడిపల్లి, అచ్చియ్యపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి దేవరాపల్లి వరకు, నాయినివారి కళ్లాల నుంచి దేవరాపల్లి సామాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద గల రోడ్డు, సంతపాలెం నుంచి నాయినవారి కళ్లాల మధ్య, సంతపాలెం నుంచి చింతపాలెం, వాకపల్లి మోదకొండమ్మ అమ్మవారి ఆలయం నుంచి వెంకటరమణమూర్తి ఆలయాల మధ్య రోడ్లుకిరువైపులా తెల్లమద్ది, నేరేడు, వేప తదితర మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ రోడ్లకిరువైపులా పెంచుతున్న మొక్కలకు ప్రత్యేకంగా నీటి తడులను అందించేందుకు చర్యలను తీసుకుంటున్నట్లు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎ.నూకరాజు, ఎఫ్ఆర్‌వో,చంద్రశేఖర్, వనసేవకుడు చిరికి గోవింద తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ పీహెచ్‌సీలో సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ సంతానం జ్ఞాపకార్థం ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. చౌడువాడ, మల్లంపాలెం, పైడంపేట, గుల్లేపల్లి, పాచిలవానిపాలెం, సీమునాపల్లి, గరుగుబిల్లి, మురుగుపాలెం గ్రామాలకు చెందిన 850 మందికి వైద్య పరీక్షలు జరిపారు. వీరందరికీ సాధారణ మందులతో పాటు రూ.1000లు విలువ చేసే మందుల కిట్‌లను అందజేశారు. చౌడువాడ పీహెచ్‌సీకి సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.5లక్షల విలువ చేసే ఆర్వో ప్లాంట్, డెలీవరి కిట్స్, బీపీ మోనిటర్స్, ఆటో క్లీనర్ మెషీన్, మంచాలను అందజేశారు. వీటిని వైద్యాధికారి మాదంనాయుడుకు ట్రస్ట్ చైర్మన్ రాజా వెంకటేష్ అందించారు. రాజా వెంకటేష్‌ను సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ అభినందించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు మాదంనాయుడు, చైతన్య, ఉత్సవ్‌మిశ్రా, కె.వి.సిద్ధార్థ, మినాల్ చక్రవర్తి, నిర్మల, కణాల్‌బాబు, ఎంపీహెచ్ఈవో జె.సన్యాసిరావు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మాదంనాయుడు, తదితరులు

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

కె.కోటపాడు : రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఎల్.వి.నారాయణరావును ఎ.కోడూరులో ఆదివారం 1995 బ్యాచ్ డీఎస్సీ ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి విశాఖ జిల్లా పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి బొడ్డు రవి, ఉపాధ్యాయులు వై.గోవింద్, సూర్రెడ్డి బాబూరావు, బి.ప్రకాశమ్మ పాల్గొన్నారు.



నారాయణరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తైక్వాండోలో సత్తా చాటిన చోడవరం విద్యార్థులు



తైక్వాండో కలర్ బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో సత్తా చాటిన చోడవరం విద్యార్థులు

చోడవరం: తైక్వాండో కలర్‌బెల్ట్ గ్రేడింగ్ పోటీల్లో చోడవరం ప్రాంత క్రీడాకారులు సత్తాచాటారు. చోడవరం హైస్కూల్ గ్రౌండ్‌లో ఈపోటీలు ఆదివారం నిర్వహించారు. చోడవరానికి చెందిన చుక్కల లాస్య, ఎం.రవిచంద్ర, వి.ఇసిత శారద రెడ్ బ్లాక్ బెల్ట్ సాధించారు. ఎన్. రిషితాంజలి, బి.పర్ణికఅరోహి, ఎస్.జానవి, ఎస్.ప్రియాంజన్‌సాయి, డి.సాత్విక్ రెడ్ బెల్ట్ సాధించారు. ఎన్. కేశవర్ధన్, జనలోచన, ఎం.శరణ్య, ఎ.విక్రమ్, షేక్ సబీన ఆజ్మి, ఎస్.భీష్మ, ఎస్.ప్రణీత్, బి.చేతన్ గ్రీన్, గ్రీన్ వన్ బెల్టులు సాధించారు. షేక్ బహిత్. కోన మేఘన, ఎం.చరణ్‌తేజ, జి.సౌజన్య, ఎల్.సునీల్‌కుమార్, ఎం.ప్రణీత్ ఎల్లో బెల్టు, ఎన్. తేజఅశ్విని, బి.యోదాదిత్య, జి.పూజిత, కె.అమూల్య బ్లూ బెల్టు సాధించారు. ఈ పోటీలు ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోషియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లం మురళీకృష్ణ పర్యవేక్షణలో నిర్వహించారు. విజేతలకు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.

మోదకొండమ్మకు ప్రత్యేక అలంకరణ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మను ఆదివారం ఆభరణాలతో పాటు ప్రత్యేక పట్టు చీర, పుష్పాలతో అలంకరించారు. అనంతరం కుంకుమ పూజలు నిర్వహించారు. సుమారు 300 మంది భక్తులు అమ్మవారి ప్రతిరూపమైన ఘటాలను శిరస్సున పెట్టుకుని ఆలయానికి కాలినడకన చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో మోదకొండమ్మ

ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: మండలంలోని ఎం. కోడూరులో మోదమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, నిర్వహించారు. కొప్పు వెంకటరమణ,ఏసురత్నం సహకారంతో ప్రసాద వితరణ చేశారు. సర్పంచ్ సంజీవిరావు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు చిహ్నం హిందీ

మాకవరపాలెం: హిందీభాష దేశ సమైక్యతకు చిహ్నమని కేజీబీవీ ఎస్‌వో త్రివేణి అన్నారు. స్థానిక కేజీబీవీలో ఆదివారం హిందీ భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం 1949లో హిందీ భాషను జాతీయ భాషగా ప్రకటించిందన్నారు. విద్యార్థులు హిందీ భాషపై పట్టు సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శృంగవరంలో బోరు ప్రారంభం

నాతవరం: మండలంలోని శృంగవరంలో నాసా స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన తాగునీటి బోరును సంస్థ ప్రతినిధులు కులపతి,మైక్‌వైజరు ఆదివారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోండ్రు అప్పారావు, నాసా సంస్థ మండల సామాజిక కార్యకర్త శ్రీను, గ్రామ పెద్దలు ఉబా మహలక్ష్మి విశ్రాంతి ఉపాధ్యాయుడు నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం



ప్రమాణ స్వీకారం చేస్తున్న అల్లం మాధవి రామఅప్పారావు

చోడవరం: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం ఆదివారం ప్రమాణస్వీకారం చేసింది. కమిటీ చైర్‌పర్సన్ అల్లం మాధవి రామఅప్పారావుతో పాటు 21 మంది అధికార, అనధికార సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. భారీ ఊరేగింపుతో చైర్‌పర్సన్ మాధవి రామఅప్పారావు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి వచ్చారు. ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు, జనసేన నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొని నూతన పాలకవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.

నాతవరం ఎస్‌ఐగా తారకేశ్వరరావు

నాతవరం: స్థానిక పోలీసు స్టేషన్ ఎస్‌ఐగా వై.తారకేశ్వరరావు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన సీహెచ్. భీమరాజుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కృష్ణదేవిపేటలో ఎస్‌ఐగా పనిచేస్తున్న తారకేశ్వరరావును నియమించారు. ఆయనను వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు, నాతవరం ఉప సర్పంచ్ కరక అప్పలరాజు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎస్‌ఐని కలిసిన వారిలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ ఉపాధ్యక్షుడు రుత్తల నాగు, మండల ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు చెక్కా జోగిరాజు, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, నాతవరం, గన్నవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జీలు సింగంపల్లి సన్యాసిదేముడు, అపిరెడ్డి మాణిక్యం ఉన్నారు.



ఎస్‌ఐ తారకేశ్వరరావుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు అప్పలరాజు

వెంకన్న ఆలయంలో ముగిసిన పవిత్రోత్సవాలు

రోలుగుంట: స్థానిక శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 12న ప్రారంభమైన పవిత్రోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి సీతారామచార్యులు అష్టోత్తర కలశ పూజను నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం

నర్సీపట్నం: విశ్వహిందూ పరిషత్ నర్సీపట్నం అఖండ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో కార్యవర్గ ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా సామిరెడ్డి సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా పైల సూర్య గణేష్, కార్యదర్శిగా లెక్కల వెంకట నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా కురచాల బాల శివ, కోశాధికారిగా రుత్తల సరస్వతి, సభ్యులుగా కట్టుమూరి శేఖర్, వెలగా నారాయణరావు, నాభా ప్రకాష్, టి.ఉమా, టి.భవాని, ఎస్. మౌనిక మంగ, ఆర్.అరుణ, నెల్లూరు రమణ, కురచ రమ్య, ఫణీంద్ర కుమార్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. వీరందరిచే పూర్వపు సహాయ కార్యదర్శి శేఖర్ ప్రమాస్వీకారం చేయించారు.